# దేవాలయాలలో దౌర్జన్యం!

రచయిత:

భావరాజు నరసింహారావు

౧

'ఏమిసామీ! టిక్కట్టు తెచ్చారా?'

'టిక్కట్టేమిటి?'

'స్వామివారి దర్శనంచేసుకోవాలంటే టిక్కట్టు కొనుక్కోవాలే, సార్. అవతల పక్క గుమాస్తాగారిదగ్గర టిక్కట్టు కొనుక్కురండి.'

... .. ..

'ఏవండీ! స్వామివారిదర్శనానికి మీదగ్గర ఏదో టిక్కట్టు కొనుక్కురమ్మంటాడేవిటి, ఆ బంట్రోతు?'

'అయ్యా! అవునండి. ఒకరూపాయియిచ్చి యీటిక్కట్టు తీసుకునిపోయి స్వామివారి దర్శనం చేసుకోండి.'

'ఆఁ! స్వామివారిదర్శనానికి ఒక్క రూపాయిపెట్టి టిక్కట్టు కొనుక్కోవాలీ? లేకపోతే చూడనివ్వరూ?'

'చిత్తం. చూడటానికి వీల్లేదండి.'

'ఇదెక్కడిపాపఖర్మ మండీ! ఇదేవన్నా నాటకమా—సినీమానా—ఎగ్జిబిషనా?—ఆరాధనకు అర్పించే ఫీజులు, మొక్కుబడికి చెల్లించే ముడుపులూగాక- దర్శనమాత్రానికి కూడా యీటిక్కట్లేవిటండీ!'

'దయచేసి ఆబోర్డుమీద వ్రాసిఉన్న రూల్సుచూడండి, అంతా మీకే అర్థమౌతుంది.'

'ఏవండీ' వింజామరముట్టుకుంటే పాతిక రూపాయిలా! యింకా దేనికో వంద రూపాయిలా! వట్టి దోంగలదోపిడిలాగుందే!...నా దగ్గర...డబ్బులేక కాదుగాని,...డబ్బు యివ్వకపోతే స్వామిని యిప్పుడు చూడటానికి వీల్లేదన్నమాట?'

'చిత్తం'

నాలో ఉన్న దేవుడి ప్రతిబింబాన్ని చూడటానికి రూపాయి ఖర్చుపెట్టడం తెలివితక్కువ కాబట్టి సరాసరి బసచేరాను.

ఇది ఏడుకొండల వేంకటేశ్వరుని సన్నిధిని.

* * *

౨

'అయ్యా! దేవాలయం తలుపులు మూసిఉన్నాయేం? దేవుణ్ణిచూడటం మెలాగ?'

'ఇప్పుడు వీల్లేదు. రాత్రి పదకొండుగంటలకు స్వామిదర్శనం యిస్తారు. విశ్వరూపం చూడాలంటే ఒకరూపాయి, 'చిదంబరరహస్యం' చూడాలంటే పాతికరూపాయిలూ యివ్వాలి.'

'అబ్బా! చాలారకాల రేట్లున్నాయే, యిక్కడకూడా!...విశ్వరూపం...చిదంబరరహస్యం...ఏవిటి?'

'ఏవని చెప్పమంటారు? చూస్తే తెలుస్తుంది. ఆహా!...ఏమిదృశ్యం, ఎంతపుణ్యం!,

'ఆ! అలాగా! అంత పుణ్యముందా వాటినిచూస్తే? కొంత—కావలిస్తే అంత—పుణ్యాం మీరు తీసుకుని నాకు వాటిని ఊరికే చూపండి.'

(నన్ను ఎగాదిగా చూసి, కాసేపు ఏమీ తోచక) అలా వీలులేదు, వెళ్ళండి.

ఇది మహాశివరాత్రినాటిరాత్రి చిదంబరంలో.

* * *

3

'అయ్యా! ఇక్కడ ముఖ్యమైనది చూడకుండానే వెళ్తున్నారు... ..ఇక్కడ రెండు బల్లు లున్నాయి—బంగారపుది, వెండిది. వాటిని ముట్టుకుంటే జన్మతరించినట్లే!'

'ఆ! అంత మహత్తుఉందా వాటికి? బల్లిని ముట్టుకుంటే దోషమంటారు కదండీ?'

'అదే చిత్రం! ఈ బల్లుల్ని ముట్టుకుంటే అలాంటి దోషాలన్నీపోయి, మోక్షం వస్తుంది!'

'బల్లుల్నిముట్టుకుంటేనే మోక్షం వస్తే యింకాకావలసిం దేముంది! ఈపాటి మనవాళ్ళంతా మోక్షంపొంది అక్కడకూడా అనెంప్లాయ్ మెంటులో' అని అఘోరిస్తూ ఉండవలసిందేనే!'

'దానికేమి లెండి......రెండణాలిస్తే ఆ పని పూర్తి చేయిస్తాను.'

'దానిక్కూడా డబ్బుకావాలీ?...ఇవ్వకపోతే ముట్టుకోకూడదనా వాటిని?'

'అహా! వీలులేదు.'

'పోనీ వీటిని ఊరికే చూడవచ్చా?'

'వీల్లేదు...ఒక్కబేడేకదండీ, యివ్వకూడదూ?'

'డబ్బు ఇవ్వకూడదని పట్టుదల ఉన్నవాణ్ణి ఒక్క బేడేకాదు—ఒక్క కానీకూడా యివ్వను.'

(నావంక ఉరిమిచూశాడు ఆ అయ్యవారు.)

ఇది శ్రీ కాంచీపురంలో.

* * *

అయ్యా! యిదీ మన దేవాలయాల ప్రస్తుతస్థితి—యివ్వీ, మన దేవాలయాల్లో యాత్రీకుల కెదురయ్యే ఘట్టాలు. 'ఇంత దూరంవచ్చి దేవుణ్ణి చూడకుండా వెళ్ళడం వేమిటి?' అని ఆముడుపు చెల్లించుకుని ఆ విగ్రహాలను, విశ్వరూపాలను చూసేవస్తారు కొందరు. ఎంతోదూరంనుంచి వచ్చామనన్నా లేకుండా దేవుణ్ణి చూడ్డానికికూడా డబ్బు అడుగుతున్నాడు, యిదెక్కడి పాపకర్మం? పటాలలో చూసేదేవుళ్ళేగా, పోన్నా'ని బైటనుంచే ఒక్క నమస్కారం దేవుడికి పంపి సరాసరి ఇళ్ళు చేర్తారు, మరికొందరు. మొత్తం మీద మొదటిరకం నూటికి తొంభై తొమ్మిది ఉంటే, రెండవరకం ఒక్కడుంటాడు!

ఈవిధంగా మన దక్షిణదేశంలోని దేవాలయాలకు పోయే ప్రతి యాత్రీకుడిదగ్గర నుంచి బలవంతంమీద డబ్బు గుంజుతున్నారన్నమాట దేవాలయాధికారులు. ఈ ఆచారం మన దక్షిణదేశంలోనే తప్ప ఉత్తర దేశంలో ఎక్కడాలేదని వినికిడి. ఈ ఆచారం పూర్వంనుంచీ ఉన్నదా? లేక యిటీవల ఎన్ని సంవత్సరాలకు పూర్వం పుట్టింది? అసలు ఈ ఆచారం అమల్లోకి రావడానికి కారణవేఁవిటి? దీనికి కారకులెవరు? అనే ప్రశ్నలకు సరి అయిన సమాధానాలు దొరకటంలేదు.

ఈ ఆచారం నిజంగా చాలా అక్రమంగా

ఉన్నది. దేవుణ్ణిచూడటానికీ, హారతి యివ్వడానికీ, అభిషేకం చేయడానికీ, పూజ చేయడానికీ—దానికీ దీని కేవిటి? ప్రతిదానికీ డబ్బు! డబ్బు!! డబ్బు!!! ఇలా కూడబెట్టిన డబ్బునేంచేస్తున్నారు? దేవుణ్ణి, అర్చకులను పోషించటానికి వారికున్న యీనాములు, యాత్రికులు భక్తితో సమర్పిస్తున్న కానుకలు సమృద్ధిగా సరిపోతవి. చివరకు దేవాలయాల మరమ్మతుకూడా చాలవరకు యాత్రికులే చేయిస్తున్నారు. ఇలాటి పరిస్థితుల్లో యీ విధంగా—కేవలం అక్రమమైన, అగౌరవమైన మార్గాలలో ధనార్జన యేమాత్రం మర్యాదగా లేదు.

* * *

పై సందేహాలనుగూర్చి ఒక మిత్రుణ్ణి అడిగితే: 'ఈమరాచారం ఉత్తరహిందూస్థానంలో ఎక్కడా లేదు. ఆఖరుకి కాశీవిశ్వేశ్వర దేవాలయంలోకూడా నిరభ్యంతరంగా దేవుణ్ణి చూడవచ్చును. . చూడగా ఒక విషయం తోస్తూంది—మనదేశం ఉత్తరభాగం విశాలంగాను దక్షిణభాగం సన్నగాను ఉన్న సంగతి మనకు తెలుసునుగదా! అల్లాగే ఉత్తరహిందూదేశంలో ఉన్న వారి మనస్సులు—ముఖ్యంగా యీ విషయంలో—అంత విశాలంగాను, దక్షిణాత్యుల మనసులు అంత సంకుచితంగాను ఉంటున్నాయి. అలానే ఉత్తర హిందూదేశస్థుడు తొమ్మిదిమూళ్ళ ధోవతికట్టుకుంటే, దక్షిణానికి రానురాను ఆధోవతి చివరకు మూడుమూళ్ళలోకి దిగింది. ఆ విధంగానే దక్షిణాత్యుడు ఒక్క సాంబారుతో భోజనక్రమం ముగిస్తే, ఔత్తరాహుడు పళ్లెంచుట్టూ డజనుగిన్నెలలో భక్ష్యాలు వడ్డించుకు ఆరగిస్తాడు. అదేవిధంగా ఉత్తర, దక్షిణ దేవాలయఆచారాల్లో కూడ భేదాలు కనబడుతున్నాయి.' అని జవాబుచెప్పాడు. అతడి ఉపన్యాససారాంశం చదువరులకే విడిచి పెడుతున్నా.

అసలే హిందూమతం మీద అభిమానం పోయి మన మతస్థులు అన్యమతాలు స్వీకరిస్తున్న యీ క్లిష్టసమయంలో యిల్లాంటి దురాచారాలకు తావిస్తే మిగిలిఉన్న కొద్దిమందికికూడ మన మతంమీదగల గౌరవం పోతుంది. మనమతంలో గల గొప్పతనాన్ని గ్రహించి పాశ్చాత్యులుకూడ మనమతాన్ని అవలంబిస్తున్న యీకాలంలో యిలాంటి అవకతవకలు మనమతంలో ఉన్నవని తెలిస్తే వాళ్ళకెలా ఉంటుందో, అందువల్ల మన మతానికి జరగబోయే నష్టం మనం ఊహించుకోగలం. ఈవిషయాలను గమనించి మన మతానికి వేరుపురుగులైన యీ దౌష్ట్యాలను మొదలంట నశింపచేయకపోతే హిందూమతానికి అనతికాలంలో వాటిల్లబోయే విపత్తులకు, క్షీణతకు మనమంతా ఉత్తరవాదులం అనవలసివస్తుంది. అలాటివాటికి చోటివ్వకుండా మన సంఘానికి, మతానికీ, దేశానికీ సేవ చేయాలంటే యీ దేవాలయాల్ని సంస్కరించాలి. ఆబాధ్యత హిందువు లందరికీ ఉన్నదని హెచ్చరిస్తున్నాను. అందుకు వెంటనే దేశమంతటా తీవ్రంగా ఆందోళన జరపవలసిందని మనవి చేస్తున్నాను.

Printed at The Andhrabhumi Printing Works, Vepery, Madras.
Editor & Publisher: Andra Seshagiri Rao. B.A.